క్లుప్తంగా

కోరం లేక సమావేశం వాయిదా

రొంపిచెర్ల: మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడిందని ఎంపీడీఓ మధుసూధన్ రెడ్డి పేర్కొన్నారు. ఎంపీపీ పురుషోత్తంరెడ్డి అధ్యక్షతన శనివారం జరగాల్సిన మండల సమావేశం ఎంపీటీసీలు ఎవరూ హాజరు కాకపోవడంతో సమావేశం వాయిదా పడిందన్నారు. ఫిబ్రవరి నెల మొదటి వారంలో మండల సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీఓ తెలిపారు.

క్రీడలతో ఏకాగ్రత



విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

కుప్పంరూరల్: క్రీడలతో ఏకాగ్రత, శారీరక దారుఢ్యం, మానసికోల్లాసం సాధ్యమని బీసీఎన్ విద్యాసంస్థల చైర్మెన్ బీసీ నాగరాజు అన్నారు. నాలుగు రోజులుగా జరుగుతున్న వార్షిక క్రీడోత్సవాల ముగింపులో పాల్గొని వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. చదువుతో పాటు క్రీడలు చాలా ముఖ్యమన్నారు. క్రీడలతో పట్టుదల, ఏకాగ్రత, మానసికోల్లాసం, శారీరక దారుఢ్యం సాధ్యమన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా రాణించాలి



మెగా చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

బైరెడ్డిపల్లి: కూటమి ప్రభుత్వంలో మహిళలకు అన్నిరంగాల్లో ప్రాధాన్యం కల్పించడం జరిగిందని పలమనేరు ఎమ్మెల్యే ఎన్.అమరనాథరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మహిళా సమాఖ్య సభ్యులకు రూ.13.92 కోట్ల మెగా చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా, సామాజికంగానే కాక పారిశ్రామికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్ర బాలాజీ, తహశీల్దార్ మాధవరాజు, డీపీఎంయూ హరిక్రిష్ణా రెడ్డి, ఏపీఎం లలిత పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధునికి సన్మానం



స్వాతంత్య్ర సమరయోధుడు టీసీ రాజన్‌ను సన్మానిస్తున్న తహసీల్దార్

పలమనేరు: జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా స్వాతంత్య్ర సమరయోధులు టీసీ రాజన్, సీనియర్ ఓటర్లు తాతయ్య, సరోజమ్మ, బాబులను స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ ఇన్బనాథన్ ఘనంగా సన్మానించారు.

హోమియో ఆస్పత్రికి మహర్దశ

- అందుబాటులో సేవలు
- ఆస్పత్రికి పెరుగుతున్న ఓపీ
- త్వరలో యోగా సేవలు



పలమనేరులోని ప్రభుత్వ హోమియో వైద్యశాల

పలమనేరు: పలమనేరు పట్టణంలోని ప్రభుత్వ హోమియో ఆస్పత్రి కొత్త హంగులతో సకల సౌకర్యాలతో రోగులకు మెరుగైన సేవలను అందిస్తోంది. గతంలో ఇక్కడి ఆస్పత్రిలో ఓపీ సగటున 40 ఉండగా ఇప్పుడు 60 నుంచి 70కి చేరింది. ఇక్కడి ఆస్పత్రిని గత ప్రభుత్వం ఇటీవల అప్‌గ్రేడ్ చేయడంతో నిధుల వచ్చి రోగులకు అవసరమైన సౌకర్యాలను చేపట్టారు. నామ్ (నేషనల్ ఆయుష్ మిషన్) ద్వారా నిధులు, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఈ ఆస్పత్రిలో సౌకర్యాలను మెరుగుపరిచారు.

అందుబాటులో వైద్యులు

జిల్లాలోనే చిత్తూరు, పలమనేరుల్లో మాత్రమే హోమియో ఆస్పత్రులున్నాయి. ఇటీవల నామ్ నిధుల ద్వారా స్థానిక ఆస్పత్రిలో పలు అభివృద్ధి పనులు జరిగాయి. రోగులకు ఆర్వో వాటర్, ప్రత్యేక మూత్రశాలలు, అవసరమైన మందులు, రోజువారి కార్యక్రమాల నిక్షిప్తం కోసం ల్యాప్‌టాప్ తదితరాలను అందజేశారు. ముఖ్యంగా పాడుబడిన విధంగా మారిన ఆస్పత్రిలో రిపేర్లు చేయించి, పెయింటింగ్‌తో కొత్త లుక్ వచ్చింది. ఆస్పత్రి నిర్వహణకు సంబంధించి గతంలో ఏడాదికి రూ.30 వేలుగా ఉన్న బడ్జెట్‌ను గత ప్రభుత్వం రూ.1.5 లక్షలకు పెంచింది. ఆస్పత్రి బయట హెర్బల్ గార్డెన్ సైతం పెంచి ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు.

మరిన్ని సేవలు

త్వరలో ఆస్పత్రికి పూర్తి స్థాయిలో యోగా సేవలు అందుబాటులోకి రానున్నాయి. హోమియో వైద్యం రోగులకు కావాల్సిన వసతులన్నింటిని కల్పించారు. సెలవు దినమైన ఆదివారం మినహా మిగిలిన రోజుల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట, ఆపై 2 నుంచి సాయంత్రం 4 దాకా సేవలు అందుబాటులో ఉంటాయి.

సద్వినియోగం చేసుకోండి



ఆస్పత్రిలో రోగులకు అవసరమైన సేవలు అందుబాటులో ఉన్నాయి. రోజువారి ఓపీ సైతం పెరిగింది. కావాల్సిన మందులు పూర్తి స్థాయిలో ఉన్నాయి. తాను ఇటీవలే విధుల్లో చేరా. గతానికి ఇప్పటికీ ఇక్కడి సేవలు మెరుగుపడ్డాయి. అవసరమైన వారు ఆస్పత్రిలో సేవలను ఉచితంగా పొందవచ్చు. –డా.ఉమారాణి, పలమనేరు, హోమియో ఆస్పత్రి

నేడు మాంసం, మద్యం అమ్మకాలు బంద్

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలో రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా మద్యం దుకాణాలు, మాంసం అంగళ్లు తెరవరాదని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణ సమీపంలోని ధాబాలు, హోటళ్లు, మాంసాహార స్టాళ్లు, రెస్టారెంట్లు ఇలా ఎవరైనా వ్యాపారాలు చేస్తే ఆ యజమానులపై జరిమానాలు తప్పవని హెచ్చరించారు. నేటి ఉదయం నుంచే తమ సిబ్బంది నిఘా ఉంటుందని తెలిపారు.

జెడ్పీ సీఈఓ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ రవికుమార్

పలమనేరు: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పలు రికార్డులను జెడ్పీ సీఈఓ రవికుమార్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం మండలంలో సాగుతున్న పనులు తదితరా అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఇందులో ఎంపీడీఓ ఖాదర్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

● బాల్యవివాహాలు నేరం



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి లిఖిత

● జూనియర్ సివిల్ జడ్జి లిఖిత

గంగవరం: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని పలమనేరు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి లిఖిత తెలిపారు. గంగవరం జడ్పీ హైస్కూల్‌లో శనివారం విద్యార్థులతో జడ్జి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్యవివాహాలు, ఉమెన్ ట్రాఫికింగ్, ఫండ మెంటల్ రైట్స్ అండ్ డ్యూటీస్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి బాలికలు అవగాహన పెంచుకోవాలన్నారు. మంచి చదువుతో భవిష్యత్తులో సమాజం గర్వించే విధంగా ఉన్నత పదవులు అధిరోహించాలని సూచించారు. అనంతరం పట్టణంలోని వాసవీ కల్యాణ మండపం వద్దనున్న బాలుర హాస్టల్‌ను తనిఖీ చేశారు. సీఐ ప్రసాద్, ఎంఈఓ శ్రీనివాసులు, హెచ్‌ఎం రూపాదేవి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం వల్లే స్వేచ్ఛ, న్యాయం



శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: ప్రజలందరికీ సమానత్వం, సోదరభావం, న్యాయం, స్వేచ్ఛ రాజ్యాంగం వల్లే అందుతున్నాయని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాజ్యాంగం అమలులోకి వచ్చి నేటికి 74 ఏళ్లు అవుతున్న సందర్భంగా అందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

మండలాభివృద్ధికి సహకరించండి



మాట్లాడుతున్న ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి

పులిచెర్ల(కల్లూరు): మండలాభివృద్ధికి అందరూ సహకరించాలని ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆయన అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కొందరు అధికారులు గైర్హాజరు కావడం సమంజసం కాదన్నారు. అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. జరుగుతున్న పనులు అందరి సభ్యులకు తెలియజేయాలని కోరారు. అర్హులందరికీ గోకులాలు మంజూరు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఈశ్వరీ గోవర్ధన్, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

ఊరూరా బెల్ట్

● గాలికొదిలిన గ్రామాల ప్రగతి





గంగవరం: బెల్ట్ షాపులు.. ప్రస్తుతం ఏ గ్రామంలో చూసినా ఇవే దర్శనమిస్తున్నాయి. గ్రామాల ప్రగతి కుంటుపడి.. బెల్ట్‌షాపులు బాగా అభివృద్ధి చెందాయి. టెండర్లు లేకనే మద్యం దుకాణాలతో సమానంగా బెల్ట్ షాపుల్లో విక్రయాలు జరుగుతున్నాయి. బెల్ట్ షాపులతో మద్యం ప్రియులకు ధన నష్టం, నిర్వాహకులకు లాభసాటిగానే ఉంది. కానీ వీటి నిర్వహణతో ప్రజల నుంచి వస్తున్న విమర్శలు ప్రభుత్వానికి తలవంపులు తెస్తున్నాయి.

గత ప్రభుత్వంలో ఎక్కడా బెల్ట్‌షాపులనే ఊసే లేదు. ఒకవేళ ఎక్కడైనా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులు, సెబ్ అధికారులు దాడులు చేసి నిర్వాహకులపై కేసులు నమోదు అయ్యేవి. అది అధికార పార్టీకి చెందిన వారైనా సరే కేసుల నమోదులో వెనుకాడేవారు కాదు. దీంతో అక్రమ విక్రయాలు జరగకుండా కట్టడి అయ్యేది. మరోవైపు కర్ణాటక మద్యం విక్రయాలు, రవాణాను పూర్తిగా నిషేధించారు. అయితే కూటమి ప్రభుత్వంలో ప్రతి గ్రామంలో బెల్ట్‌షాపులు పుట్టుకొచ్చి మద్యం ప్రియులకు చేరువయ్యాయి.

అధిక ధరలు

పట్టణాల్లోని మద్యం దుకాణాల నుంచి పదుల సంఖ్యలో మద్యం కేసులు గ్రామాల్లోని బెల్ట్ షాపులకు నేరుగా సరఫరా అవుతున్నాయి. ఒక్కో పంచాయతీలో రెండు నుంచి మూడు చొప్పున తయారై ఎంఆర్‌పీ రేట్ల కంటే దాదాపు 20 శాతం అధిక ధరలతో మద్యం విక్రయాలు కొనసాగుతున్నాయి. దీంతో ఉన్న ధర కంటే రూ. 20 అధికంగా క్వార్టర్ బాటిల్‌పైన వెచ్చించాలి. దీనివల్ల ప్రజాధనం దుర్వినియోగమే కాకుండా ఇళ్లలో కుటుంబికుల మధ్య చిచ్చురేపుతోంది. టెండర్లతో తమ సొంతం చేసుకున్న మద్యం దుకాణాలు తప్ప గ్రామాల్లో ఎక్కడైనా బెల్ట్ షాపులు ఉన్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తప్పవన్న సీఎం చంద్రబాబు ఆదేశాలను సైతం అటు ప్రభుత్వ పెద్దలు, ఇటు అధికారులు తుంగలో తొక్కుతున్నారు.

ఉన్న డబ్బంతా మద్యానికే..

గ్రామాల్లో బెల్ట్ షాపులు పుట్టుకొచ్చినప్పటి నుంచి ఆ ఊళ్లలోని పేదింటి నివాసాల్లో సంపాదనంతా మద్యం కొనుగోలుకే సరిపోతుంది. కూలి పనులతో రోజుకు సగటున రూ. 500 ఉంటుంది. ప్రతి ఇంటికి చేరువలోనే మద్యం అందుబాటులో ఉంది. సంపాదించిన సొమ్మంతా మద్యానికే ధారపోస్తున్నారు. దీంతో రోజూవారీ సంపాదన మద్యం కోసమే వినియోగిస్తుంటే తిండికి లేక ఇళ్లలో అందరూ పస్తులుండటం.. మరోవైపు రోగాల బారిన పడి ఆసుపత్రుల పాలై మృత్యువాత పడటం చూస్తున్నాం. దీనివల్ల ఇంటి యజమానిని కోల్పోతే ఆ ఇంటికి దిక్కెవరంటూ కుటుంబికులతో పాటు గ్రామాల ప్రజలు తీవ్ర ఆరోపణలు గుప్పిస్తున్నారు.

కుటుంబాల్లో గొడవలు

గతంలో పెద్దపంజాణి మండలానికి చెందిన ఓ వ్యక్తి కల్లుపల్లిలోని బెల్ట్ షాపులో కొనుగోలు చేసిన మద్యాన్ని ఫుల్లుగా తాగి అక్కడే కొద్ది దూరంలో ఉన్న బావిలో పడి మరణించిన ఘటన ఈ మధ్యనే చూశాం. ఇంత జరిగినా బెల్ట్ షాపులపై ప్రభుత్వ అధికారులు ఏ విధమైన చర్యలు తీసుకోవడంలేదు. అసలే జీవనాధారం లేని ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న సొమ్మంతా మద్యానికే తగలేస్తున్నారంటూ కుటుంబికుల మధ్య గొడవలు చెలరేగుతున్నాయి. కుటుంబాల మధ్య ఇంతటి చిచ్చుకు కారణమైన బెల్ట్ షాపులపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదంటూ మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● మాక్ పార్లమెంట్



నమూనా పార్లమెంట్ నిర్వహిస్తున్న విద్యార్థులు

కుప్పంరూరల్: ఓటు వినియోగంతో భవిష్యత్తు సమాజాన్ని నిర్మించగలమని టి.సదుమూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పద్మనాభరాజు పేర్కొన్నారు. శనివారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో నమూనా పోలింగ్, పార్లమెంట్ సమావేశాలను నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు పద్మనాభరాజు మాట్లాడుతూ.. ఓటు హక్కు ద్వారా మంచి నాయకుడిని ఎన్నుకుంటే మంచి ప్రభుత్వం ఏర్పడుతుందని ఫలితంగా దేశం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కరుణాకరన్, కేశవులు, పాఠశాల కమిటీ చైర్మెన్ మోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● గణతంత్ర కాంతులు



గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌ను విద్యుత్‌కాంతులతో ముందస్తుగా ముస్తాబు చేశారు. జాతీయజెండా రంగులతో లైట్స్ వేసి చూడముచ్చటగా సిద్ధం చేశారు. ఈ వెలుగులు ప్రయాణికులను, చూపరులను కట్టిపడేస్తున్నాయి.

– చిత్తూరు కార్పొరేషన్

ఏకాగ్రతతో వాహనాలు నడపాలి

చిత్తూరు కలెక్టరేట్ : వాహనం నడిపే సమయంలో ప్రతి ఒక్కరూ కుటుంబాన్ని గుర్తు పెట్టుకుని ఏకాగ్రతతో నడపాలని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. ఈ మేరకు నగరంలోని సంసిద్ధ్ క్యాంపోర్డ్ పాఠశాలలో శనివారం 36 వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ వినియోగించాలన్నారు. మానవ తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలిపారు. డీటీసీ నిరంజన్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ నిత్యబాబు మాట్లాడుతూ వాహనాల కండీషన్‌ను ఎప్పటికప్పుడు పరీక్షించుకోవడం వల్ల ప్రమాదాలను అరికట్టవచ్చన్నారు. లైసెన్స్ లేని డ్రైవర్ చేతికి పాఠశాల వాహనం ఇవ్వకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ రాజేశ్వరరావు, సంసిద్ధ్ క్యాంపోర్డ్ కరస్పాండెంట్ మహేశ్‌రెడ్డి, డ్రైవర్లు పాల్గొన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి



రికార్డులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ

గంగవరం: గ్రామాల్లో సమస్యలు సత్వరమే పరిష్కరించాలని జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు అధికారులను ఆదేశించారు. గంగవరం సచివాలయంతోపాటు మండల పరిషత్ కార్యాలయాన్ని డీఎల్‌డీఓ రవికుమార్‌తో కలి సి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా కార్యాలయాల్లో రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా తాగునీటి సమస్యపై అధికారులు శ్రద్ధ చూపి, అవసరమైన చోట నిధులు మంజూరు చేసి, బోర్లు, పైపులైన్ల పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకో వాలని సూచించారు. ఎంపీడీఓ సురేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

హుండీ ఆదాయం రూ 3.59 లక్షలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయానికి హుండీ లెక్కింపు ద్వారా రూ.3,59,183 ఆదాయం వచ్చినట్లు ఈఓ మునిరాజులు తెలిపారు. శనివారం ఆలయం ఆవరణలో హుండీ లెక్కింపు చిత్తూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ సుమనప్రియ పర్యవేక్షణలో చేపట్టినట్లు తెలిపారు. నాలుగు నెలలకు సంబంధించి ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీల ద్వారా రూ.3,02,061, అన్నదానం హుండీ ద్వారా రూ.57,122 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

ఓటు వజ్రాయుధం



పలమనేరు: ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ

పలమనేరు: ఓటు హక్కును బాధ్యతగా భావించి ఓటును వినియోగించుకోవాలని పలమనేరు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి సూచించారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పలమనేరులో రెవెన్యూ, మున్సిపల్ శాఖలు శనివారం నిర్వహించాయి. తొలుత మున్సిపల్, రెవెన్యూ అధికారులు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ, మానవహారం చేపట్టారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ఎంత ముఖ్యమో ఓట్లు అంతే కీలకమని కమిషనర్ చెప్పారు.అనంతరం ఓటరు దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు. జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీల్లో డొడ్డిపల్లి హైస్కూల్‌కు చెందిన విద్యార్థి చరణ్‌తేజ తొలిస్థానం సాధించడంతో జిల్లా కేంద్రంలో జేసీ విద్యాధరి చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. దీంతో ఆ విద్యార్థిని స్థానిక ఎంఈఓలు లీలారాణి, బాలసుందరం అభినందించారు.

సదుం: ఓటు హక్కు వజ్రాయుధంలాంటిదని ఇన్‌చార్జి తహసీల్దారు మారుఫ్ హుస్సేన్, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ వెంకటనాథరెడ్డి పేర్కొన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో కలసి ర్యాలీ చేసి బస్టాండులో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరిబాబు, డీటీ కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ బాలస్వామి పాల్గొన్నారు.

రొంపిచెర్ల: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహశీల్దార్ కిరణ్‌కుమార్ అన్నారు. రొంపిచెర్లలో ర్యాలీ నిర్వహించి సీనియర్ ఓటర్లను సన్మానించారు. డీటీ లోకేష్, ఎంఈఓ శ్రీనివాసులు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

పెద్దపంజాణి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, రంగవల్లుల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. అదే విధంగా సీనియర్ ఓటర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ అనిల్‌కుమార్ , ఎంఈఓ గోపాల్ రెడ్డి, రీసర్వే డీటీ రమేష్ బాబు, ఆర్‌ఐ రాకేష్ కుమార్, హెచ్‌ఎం కేశవపిళ్లై పాల్గొన్నారు.

కుప్పంరూరల్: ఓటు వేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని డి.కె.పల్లి టీడీపీ ఏరియా ఇన్‌చార్జి సత్యేంద్రశేఖర్ అన్నారు. శనివారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని సీనియర్ సిటిజన్లను సత్కరించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సోమశేఖర్, మురుగ, నబీ, స్థానికులు ఉన్నారు.

కుప్పం: జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా శనివారం కుప్పంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కుప్పం రెవెన్యూ అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో బాలుర ఉన్నత పాఠశాలలో అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు, తహసీల్దారు చిట్టిబాబు పాల్గొన్నారు.

రామకుప్పం: 18 సంవత్సరాలు నిండిన యువత ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని తహసీల్దార్ బాబు అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ ఓటరు దినోత్సవంను నిర్వహించారు. అనంతరం రామకుప్పంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ బాలాజీ పాల్గొన్నారు.

గుడుపల్లె: ఓటు హక్కును ప్రతి పౌరుడు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సీతారాం పేర్కొన్నారు. శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవంను ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులచే ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. వృద్ధ ఓటు హక్కుదారులను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాధాక్రిష్ణ, ఎంఈఓ లక్ష్మయ్య, కళాశాల ప్రిన్సిపల్ రామక్రిష్ణమనాయుడు పాల్గొన్నారు.



రొంపిచెర్ల: సీనియర్ సిటిజన్స్‌ను సన్మానిస్తున్న తహశీల్దార్



కుప్పం: ర్యాలీలో విద్యార్థులు, అధికారులు, ఉపాధ్యాయులు



సదుం: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు